కోలాహలం.. నిమజ్జనం




పెద్దపంజాణి: రాయలపేటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు, జవుకుపాళ్యంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న వినాయక విగ్రహాలను బుధవారం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. తొలుత వినాయకుని ప్రతిమలను ట్రాక్టర్లపై కొలువుదీర్చి యువకులు రంగులు చల్లుకుంటూ, పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ, ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెన్నారెడ్డిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక శివాజీనగర్, రామనగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు బుధవారం ప్రత్యేక పూజల అనంతరం కోలాహలంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. డప్పుల మోత, యువకుల కేరింతల నడుమ ఊరేగింపుగా పురవీధుల్లో తీసుకెళ్లారు. సాయంత్రం విగ్రహాలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. శివాజీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఎత్తైన వినాయక విగ్రహం అందరినీ ఆకట్టుకుంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రామకుప్పంలో..



నెహ్రూబజార్‌లో..

బైరెడ్డిపల్లెలో...

బైరెడ్డిపల్లె: వినాయకచవితి పండుగ సందర్భంగా బైరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదవరోజు బుధవారం నిమజ్జనానికి తరలించారు. కురవీధి, జవుకుపాళ్యం, నెహ్రూబజార్, చెక్‌పోస్టు కూడలిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ట్రాక్టర్‌పై కొలువుదీర్చి వీధుల గుండా ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ, బాణసంచా పేల్చుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయండి

–సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసరావు



గంగవరం: పలమనేరు జవిలి వీధిలోని సీనియర్ సివిల్ కోర్టులో ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీనియర్ సివిల్ కోర్టు, పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ కోర్టు, సబ్ కోర్టు ఆవరణలోని స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏళ్ల కాలంగా కేసుల పరిష్కారానికి నోచుకోని కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పలు కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు సమన్వయంతో తమ వంతు కృషి చేయాలన్నారు.

కుటుంబ విలువలపై ధార్మికోపన్యాసం



ప్రభాకర్‌రాజుని సత్కరించిన కమిటీ సభ్యులు

గంగవరం: స్థానిక సాయిగార్డెన్ సిటీలో ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ధి వినాయకస్వామి మండపం ఎదుట వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బుధవారం ధార్మికోపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్రీయ ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ ప్రతినిధి ప్రభాకర్ రాజు..భక్తి, కుటుంబ విలువలు, సంస్కృతి వారసత్వ సంప్రదాయాలపై ప్రసంగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. గుణశేఖర్, మాధవీలత, ఆనందబాబు, తులసినాధంనాయుడు, బాలకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సామాజిక సేవలతో ఎంపీ జన్మదిన వేడుకలు



పుంగనూరు: బస్టాండులో అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, రాజేష్ తదితరులు



చౌడేపల్లెలో..,



సదుం: అన్నదానం చేస్తున్న సుధీర్‌రెడ్డి తదితరులు

పుంగనూరు/చౌడేపల్లె/సదుం/కల్లూరు(రొంపిచెర్ల)/కుప్పం/కుప్పంరూరల్: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి జన్మదిన వేడుకలను పుంగనూరు, చౌడేపల్లె, సదుం, పులిచెర్ల, కుప్పం మండలాల్లో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ చేసి పంచారు. పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. అలాగే మిథున్‌రెడ్డి పేరిట ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్ ఆధ్వర్యంలో మిథున్ యువజన సంఘం నాయకుడు రాజేష్ ఆధ్వర్యంలో 2వేల మందికి అన్నదానం చేశారు. సదుంలో నేతాజీ, వైఎస్సార్ విగ్రహాలకు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి పూల మాలలు వేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో ఎస్ఎస్.పేటలో మైనారిటీ సెల్ నాయకులు అంజాద్‌బాషా, లడ్డూ, మున్నా, నూర్, బావాజాన్ ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పుంగనూరు, కుప్పం మున్సిపల్ చైర్మన్లు అలీమ్‌బాషా, డాక్టర్ సుధీర్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చీలేపల్లి రవి, పలువురు కౌన్సిలర్లు, చౌడేపల్లె ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ కళ్యాణ్ భరత్, వివిధ మండలాల పార్టీ కన్వీనర్లు అంజిబాబు, నాదమునిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, పులిచెర్ల ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి, పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

బంగారుపాళెం: ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని తర్ల్(టీచింగ్ ఎట్ ద రైట్ లెవల్)రాష్ట్ర కో–ఆర్డినేటర్ కల్పన శైల అన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. పిల్లలు అందరూ యూనిఫాంతో పాఠశాలకు హాజరు కావడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. పిల్లలను పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయిలో పిల్లలకు చక్కగా అర్థమయ్యేలా చదువు నేర్పించడమే తర్ల్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పిల్లల్లో నైపుణ్యాలు గుర్తించి, దానికి తగ్గట్టు వారిని తీర్చిదిద్దాలని సూచించారు. తర్ల్ కార్యక్రమాన్ని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపయోగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ నరోత్తమరెడ్డి, జీసీడీఓ ఇంద్రాణి, ఎంఈఓ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ దాడిలో గాయపడ్డ వారికి పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, నాయకులు

సదుం: మండలంలోని పాలమంద పెద్దూరులో వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై టీడీపీ నాయకులు బుధవారం దాడి చేసి గాయపరిచారు. దాడిలో గాయపడ్డ మునీంద్ర, ఖాదర్ బాషా, శివాజీ, మల్లికార్జునను మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. వారిని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు, హరినాథరెడ్డి, రమణారెడ్డి, నరేష్ తదితరులు పరామర్శించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

13న 'డయల్ యువర్ డీఎం'

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని 13న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. ఆర్టీసీ సేవల పరంగా సమస్యలు, సూచనలు ప్రయాణికుల నుంచి స్వీకరిస్తామని, డిపో పరిధిలో ఎక్కడైనా సమస్యలున్న పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

బలిజ అభ్యుదయ సేవా సంఘం ప్రెసిడెంట్‌గా రూపేష్



రూపేష్‌ను సత్కరిస్తున్న బలిజ నాయకులు

గంగవరం: బలిజ అభ్యుదయ సేవా సంఘం ప్రెసిడెంట్‌గా వీఎం.రూపేష్‌ను ఆ సంఘ పెద్దలు, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బలిజ సంఘం సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు సుధాకర్, పీజేసీ బాబు, కార్యదర్శి కిరణ్, ఆకుల గజేంద్ర, ఏకే మూర్తి, జయశంకర్, సభ్యులు అందరూ కలిసి సరస్వతీ హోటల్ యజమాని రూపేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. అసోసియేషన్ అభివృద్ధి, బలిజల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని రూపేష్ తెలిపారు.

అభివృద్ధి పనులపై జెడ్పీ సీఈఓ సమీక్ష

తవణంపల్లె: మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ గ్లోరియా ఎంపీడీఓను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు అభివృద్ధి పనుల గురించి ఆరాతీశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై సమీక్షించారు. అభివృద్ధి పనులకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించి సూచనలు–సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకే నిధులను వ్యయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏఓ రెడ్డిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే ముఖ్యం

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



వైద్యులతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వడమే ధ్యేయంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ఓగు పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, మందుల గదిని, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. ఇటీవల ఎక్కడ చూసినా విషజ్వరాలు ప్రబలుతున్నాయని, జ్వర పీడితులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చికిత్స చేయాలన్నారు. అలాగే, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. మౌలిక వసతుల కల్పన విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

గంగవరం: జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, పలమనేరు రూరల్ మండిపేట కోటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్, వైద్య శాఖలు సంయుక్తంగా బుధవారం పీఎం పోషణ మాసోత్సవాలను నిర్వహించాయి. ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడారు. బాలికలు పౌష్టికాహారం బాగా తీసుకోవాలని, 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేసుకోవాలన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. బాగా చదువుకునిఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. డాక్టర్ నిరంజన్, సబ్ యూనిట్ అధికారి జయశంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ అమర వీరులకు నివాళి



అమర వీరులను స్మరిస్తున్న అటవీ అధికారులు

గంగవరం: పలమనేరు అటవీ శాఖ కార్యాలయం వద్ద జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్, ఎఫ్ఆర్ఓ శివన్న ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ, అటవీ శాఖలో పని చేస్తున్న ఎంతోమంది అమరవీరులయ్యారని, వారిని ప్రతి ఏటా స్మరించుకోవడం కోసమే ఈ దినోత్సవం ముఖ్యోద్దేశమన్నారు. విధి నిర్వహణలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. క్రూరమృగాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అలాగే వన్యప్రాణుల వేటకు వేటగాళ్లు పెట్టే నాటు బాంబుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే వన్యప్రాణులు, అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎఫ్ఎస్ఓలు సురేంద్ర, అరుణ్ బాషా, గార్డులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కల్లూరు(రొంపిచెర్ల): పరిసరాలను శుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని కల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి అన్నారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్లూరులో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలికాలని కోరారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్ర, వేణుగోపాల్, స్నేహమాలిని, చలపతి పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 4 సమస్యలు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల వినియోగదారులు సమస్యలు నివేదించారు. తమ దృష్టికి వచ్చిన నాలుగు సమస్యల్లో ఒకటి పరిష్కరించామని, మిగిలినవి ఆర్థికపరమైన సమస్యలతో ముడిపడి ఉన్నాయని, వాటికి అనుమతులు రాగానే పరిష్కరిస్తామని ఈఈ మునిచంద్ర తెలిపారు. కార్యక్రమంలో డీఈ శేషాద్రి, ఏఈలు కేశవచంద్ర, మాధురి, లోకేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం



ఖాళీ బిందెలతో నీళ్ల కోసం అవస్థలు పడుతున్న ప్రజలు

- తాగునీటి ట్రాన్స్‌ఫార్మర్‌కే మరో వ్యవసాయ బోరు కనెక్షన్!
- ఓవర్‌లోడుతో కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్
- విద్యుత్ లేక పని చేయని ఊరి బోరు
- వారాలుగా ప్రజలకు తాగునీటి కష్టాలు

గంగవరం: మండలంలోని కోనపరెడ్డిపల్లె తాగునీటి కష్టాలతో గొంతెండుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. నీళ్ల కోసం ఖాళీ బిందెలతో ప్రజలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చింది. వివరాలు.. పదేళ్ల క్రితం ఊరిలో తాగునీటి బోరుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కే ఓ రైతు వ్యవసాయ బోరుకి సైతం కాసులకు కక్కుర్తి పడి ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఫలితంగా రెండు బోర్ల లోడు తట్టుకోలేక తరచూ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో బోరు పని చేయక ప్రజలు నీళ్ల కోసం అంగలార్చారు. సమస్యకు కారణమైన ట్రాన్స్‌కో అధికారులు మాత్రం పట్టించుకోలేదు. రైతు వద్ద చలానా కట్టించుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌కు లోడు పెంచి 15 హెచ్‌పీ చేశారు. ఇంత మొత్తం కరెంటు కేవలం ఒక బోరుకు మాత్రమే సరిపోతుంది. రెండు బోర్లకు సరిపడా కరెంటు సరఫరా లేకపోవడంతో తరచుగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం.. ఊరి బోరు ఆగిపోయి ప్రజలకు తాగునీటి కష్టాలు తరచూ ఎదురవుతున్నాయి. ఇటీవలే పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి ఈ విషయమై ట్రాన్స్‌కో ఏడీకి అర్జీ ఇచ్చి సమస్యను నివేదించారు. వారాలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు సమస్య ఉండడంతో గ్రామస్తులు తాగునీళ్లు మహాప్రభో అని అలమటిస్తున్నారు.

బ్రహ్మోత్సవం.. నృత్య సమ్మోహనం

కాణిపాకం: వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దేవస్థానం ఆస్థాన మండపంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యంతో కళాకారులు మంత్రముగ్ధుల్ని చేశారు. ఉదయం కోదండరామ స్వామి ధార్మికోపన్యాసమిచ్చారు. కోదండయ్య, తిరుపతికి చెందిన మౌనిక భక్తిగీతాలు ఆలపించారు. తిరుపతికి చెందిన శిల్పారామ బృందం, ఉమశ్రీ, వినాయక విద్యామందిర్, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. భగవాన్ సత్యసాయి నాటకోత్సవ సమితి, నెల్లూరు చెన్నకేశవ నాట్యమండలి పౌరాణిక నాటక ప్రదర్శన, కోలాటాలు, భజనలు, లంబాడీ నృత్యాలతో మండపం కళకళలాడింది. కళాకారులను అధికారులు సత్కరించారు.



చిన్నారుల గీతాలాపన



నృత్య ప్రదర్శనలో కళాకారిణి




ఊరేగింపులో కోలాట బృందాల ప్రదర్శన